అధికారులూ.. కిమ్మనరేం..?

- షీ టాయిలెట్ పేరుతో ఆక్రమణ
- యథేచ్ఛగా ఫుట్‌పాత్‌పై వ్యాపారం
- ఈ వెహికల్స్‌కు తప్పని తిప్పలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- ఫుట్‌పాత్ ఆక్రమణపై జనం ఆగ్రహం


సైనిక్‌పురి చౌరస్తాలో వార్డు కార్యాలయం సాక్షిగా ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపార సముదాయం ఏర్పాటు

కాప్రా: సైనిక్‌పురి చౌరస్తాలో వార్డు కార్యాలయం సాక్షిగా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. షీ టాయిలెట్‌తో పేరుతో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఫుడ్ కోర్టు నిర్మించి యథేచ్ఛగా తన వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణతో అటు జనంతో పాటు ఇటు వార్డు కార్యాలయ సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే హెచ్చరించి చర్యలు తీసుకుంటున్న అధికారులు సైనిక్‌పురి చౌరస్తాలో ఫుట్‌పాత్‌ను కబ్జా చేసి వ్యాపారం నిర్వహిస్తున్నా.. చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల జమ్మిగడ్డ సమీపంలోని 199 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని కొందరు పేదలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, పెద్ద ఎత్తున భారీ పోలీసు బలగాలతో నేలమట్టం చేశారు అధికారులు. మరి ఈ ప్రధాన చౌరస్తాలో జనం ఇబ్బందులు పడుతున్నా అధికారులకు ఎందుకు కనిపించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

మూతపడిన షీ టాయిలెట్

మహిళల సౌకర్యార్థం సైనిక్‌పురి చౌరస్తాలో మున్సిపల్ అధికారులు షీ టాయిలెట్ ఏర్పాటు చేసి దాని నిర్వహణను ఓ వ్యక్తికి అప్పగించారు. షీ టాయిలెట్‌కు కేటాయించిన కంటైనర్‌లో వెనుకభాగం షీ టాయిలెట్, ముందు భాగంగాలో కొంత మేర నిర్వహణ ఖర్చుల కోసం చిరు వ్యాపారానికి అనుమతించారు. కానీ సదరు వ్యక్తి మొత్తానికే షీ టాయిలెట్‌ను మూసివేసి పెద్ద వ్యాపార సముదాయంగా మార్చేసి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. పక్కా షెడ్ నిర్మాణం చేపట్టడమే కాకుండా షీ టాయిలెట్ పైభాగంలో కూడా మరో షెడ్ ఏర్పాటు చేశాడు.

యథేచ్ఛగా ఆక్రమణ.. వ్యాపారం నిర్వహణ

ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏకంగా పక్కా షెడ్ నిర్వహించడంతో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీంతో పాటు పాదచారులు రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన చౌరస్తాలో ఇంత యథేచ్ఛగా ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తుంటే చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారని జనం ప్రశ్నించుకుంటున్నారు. అధికారులు, రాజకీయ నేతల అండదండలున్న వారికి ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా? అని అంటున్నారు.


మూతపడిన షీ టాయిలెట్

అనుమతి లేదంటున్న అధికార వర్గాలు

ఫుడ్‌కోర్టు నిర్వహణ ఫుట్‌పాత్‌ను ఆక్రమించి కొనసాగిస్తున్నారని వాస్తవమని కాప్రా సర్కిల్ కార్యాలయం సిబ్బంది, వార్డు కార్యాలయ అధికారి చెబుతున్నారు. చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అడిగితే మాత్రం దాని వెనుక పెద్ద పెద్ద నేతల హస్తం ఉందని చెబుతున్నారు. మేం ఎలా చర్యలు తీసుకునేది.. అందుకే వెనుకాడుతున్నామని సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుకుంటున్నట్లు తెలిసిన సమాచారం. ఆక్రమణపై వార్డు కార్యాలయం నుంచి సర్కిల్ కార్యాలయంతో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డు ఆఫీస్ సిబ్బంది చెబుతున్నారు.

ఎలక్ట్రిక్ వాహనదారులకు ఇబ్బందులు

ఫుట్‌పాత్ ఆక్రమణ, భారీ షెడ్ నిర్మాణంతో అటు ఎలక్ట్రిక్ వెహికల్స్ వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సైనిక్‌పురి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌ను ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌పై అక్రమంగా భారీ షెడ్ నిర్మించడంతో ఈ-వెహికల్స్ చార్జింగ్ మిషన్ కనిపించకుండా పోయింది. దీంతో ఇక్కడ ఈ-వెహికల్స్ చార్జింగ్ ఉందనే విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

పోలీస్ ప్రొటక్షన్ కోసం..

ఫుట్‌పాత్ ఆక్రమణపై సర్కిల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగం వివరణ కోరగా ఆక్రమణలు తమ దృష్టికి వచ్చాయని, ఫుట్‌పాత్ ఆక్రమించి భారీ షెడ్ నిర్మించి వ్యాపార సముదాయం నిర్వహిస్తుంది వాస్తవమేనని పేర్కొన్నారు. అయితే చర్యలు తీసుకునేందుకు పోలీసు ప్రొటెక్షన్ కోసం పోలీసు విభాగానికి లేఖ రాశామని, వారు ప్రొటక్షన్ ఇస్తే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వార్డు కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్ ఆక్రమించి, అక్రమంగా షెడ్ నిర్మించింది వాస్తవమే. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇష్టానుసారంగా షెడ్ ఏర్పాటు చేసి వ్యాపార సముదాయంగా మార్చడంతో మేం కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సిబ్బందితో పాటు వార్డు కార్యాలయానికి వచ్చే జనం వాహనాలు కూడా లోనికి రానీయకుండా గేటు ముందే వ్యాపార నిర్వాహకుల వాహనాలు అడ్డు పెడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. మరోసారి వారి దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– విజయరాజు, వార్డు ఆఫీసర్

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


చర్లపల్లిలో యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని విద్యామారుతీకాలనీలో రూ.14 లక్షలు, వీఆర్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టే దిశగా కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా అన్ని కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు గడ్డం యాదగిరి, నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కేవీఎల్ఎన్ రావు, వెంకటేష్, పాండు, విజయ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


జలమండలి ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మల్లాపూర్: డివిజన్ పరిధిలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఎండీని కోరారు. ఎండీని కలిసిన వారిలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు సాయిజెనోఖర్ ఉన్నారు.

పఠాన్ బస్తీలో విద్యుత్ తీగలను మార్చాలి


విద్యుత్ ఏఈ పూజకు వినతి పత్రం అందజేస్తున్న అన్వర్ పఠాన్

మల్లాపూర్: ఓల్డ్‌మల్లాపూర్ పఠాన్‌బస్తీలో విద్యుత్ తీగలను మార్చాలని కోరుతూ గురువారం మల్లాపూర్ విద్యుత్ ఏఈ పూజకు వినతి పత్రాన్ని పఠాన్‌బస్తీకి చెందిన ఎండీ అన్వర్ పఠాన్ అందజేశారు. విద్యుత్ స్తంభాలకు గతంలో ఏర్పాటు చేసిన తీగలతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. విద్యార్థులు 200కు పైగా ప్రాజెక్ట్ నమూనాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. వీటిలో రోప్ బ్రిడ్జ్, గ్లోబ్, గేట్‌వే ఆఫ్ ఇండియా, చార్మినార్, పొల్యూషన్, వాటర్ పొల్యూషన్, సోలార్ సిస్టమ్, గుండె, ఊపిరి తిత్తులు, కిడ్నీ, మోడల్ విలేజ్, మెట్రో రైల్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జె.గంగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన ఏఆర్‌కే హోమ్స్ అసోసియేషన్ సభ్యులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ ఏఆర్‌కే హోమ్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ, నాలా పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లు, బస్సు సౌకర్యం కల్పించాలని, కుక్కల బెడద పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వాసులు పికె.నాయేర్, శ్రీనివాస్, గోపాలకృష్ణ, శ్రీనివాస్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి


సిబ్బందితో సమావేశం

మల్కాజిగిరి: ఆస్తి పన్ను అపరాధ రుసుం మాఫీ(90 శాతం) అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆస్తి పన్ను చెల్లించాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జి.రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీసీ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన సర్కిల్ కార్యాలయంలో పరిష్కార వేదికను ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఏర్పాటు చేశామని ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అపరాధ రుసుం 90 శాతం మాఫీ చేసిందన్నారు. ఆస్తి పన్ను చెల్లించి సర్కిల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ పార్వతీనగర్, న్యూశ్రీరాంనగర్ కాలనీలో గురువారం సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి


పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న చర్లపల్లి డివిజన్ వివిధ పార్టీల నాయకులు

కుషాయిగూడ: రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తిరిగి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేసి పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సీతారాంరెడ్డి, అంజిరెడ్డి, గడ్డం యాదగిరి, గోపాల్‌యాదవ్, ఆనంద్‌రాజ్‌గౌడ్, పెద్ది నాగరాజు, శ్రవణ్‌కుమార్, నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: న్యూశ్రీనగర్ కాలనీలో మురుగు నీటి సమస్యపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు. మౌలాలి పారిశ్రామి కవాడ వెనుక ఉన్న కాలనీలో తరచూ ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడటమే కాకుండా తరచూ మురుగు రోడ్డు మీద పారుతుండటంతో కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. సమస్య చాలా రోజుల నుంచి ఉందని చెప్పడంతో అధికారులను శాశ్వత పరిష్కారానికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేయమని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, డీజీఎం అశిత, మేనేజర్ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అల్వాల్: ఆర్థిక నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఐ.శ్రీనివాసులు అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్‌లో భాగంగా గురువారం కొంకూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, దీంతో విద్యార్థి త్వరితగతిన ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. బ్యాంకు ద్వారా విద్యా రుణం రూ.4 లక్షల వరకు పొందవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు మురళి, జిల్లా ఏఎంవో రాజు ఉన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్: సాయినగర్‌లోని సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గ్యాస్ట్రో, కంటి, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఆర్థో, పిడియాట్రిక్స్, గైనకాలజీ తదితర విభాగంలో పరీక్షలు చేస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్: 8885018785, 040-40181288.

షిరిడీసాయిబాబా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ రైల్వే ట్రాక్ దగ్గరలో ఉన్న షిరిడీసాయిబాబా దేవాలయం 28వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, అర్చన, సాయి సత్యవ్రతం, రాత్రి పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలను పూజారి సత్యపండిట్ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పూజా కార్యక్రమాలకు ఆలయ ట్రస్ట్ సభ్యులు హాజరయ్యారు.

శ్రీవారి ఆలయంలో గీతాజ్ఞాన యజ్ఞం



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీమత్ గీతాజ్ఞాన యజ్ఞం, శ్రీమత్ భాగవత కథా సప్తాహం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై జ్ఞాన యజ్ఞంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రుల రఘురాంశర్మ, పెద్ది రమేష్, ప్రవీణ్, బ్రహ్మచారి, పద్మాచారి, శ్రీనివాస్, లింగారెడ్డి, రాంబాబు, నాయకులు మల్లేష్‌గౌడ్, వీఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

సెంచరి దొంగ అరెస్టు

అల్వాల్: వందకుపైగా దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న పాత నేరస్తుడిని అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరించారు. అల్వాల్ డీఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ అనేకమార్లు జైలుకు వెళ్లి వచ్చిన పాత నేరస్తుడైన శాలిబండకు చెందిన మహ్మద్ అవేజ్ అహ్మద్(42) దొంగతనమే వృత్తిగా జీవనం కొనసాగిస్తున్నాడు. అవేజ్ అహ్మద్ మొదటిసారి 2005లో దొంగతనం కేసులో పోలీసులకు దొరికి జైలుకు వెళ్లడం జరిగింది. ఆ తర్వాత దొంగతనమే వృత్తిగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ బంగారు ఆభరణాలతో పాటు నగదును అపహరించాడు. అతడిపై 2001లో కూకట్‌పల్లి, 2016లో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లలో పీడీ యాక్టు పెట్టినా ప్రవర్తనలో మార్పులు రాలేదు. దాదాపు వందకు పైగా దొంగతనం కేసుల్లో అవేజ్ అహ్మద్ నిందితుడిగా ఉన్నాడని వెల్లడించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి 28న అవేజ్ అహ్మద్, అతడికి సహకరించిన సలామ్ బిమ్‌లను అరెస్ట్ చేసి విచారించగా సరూర్‌నగర్, మేడిపల్లి తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేసిన దొంగతనాలను సైతం నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

బోడుప్పల్: తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి పన్ను బకాయిదారులకు వడ్డీపై 90 శాతం మాఫీ ప్రకటించినట్లు కమిషనర్ రామలింగం వెల్లడించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మాఫీ గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను మొత్తం చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని స్థానిక ఇంటి యజమానులు వినియోగించుకోవాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణ ఆలయంలో లక్ష్మీనారాయణ హోమం



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలో శ్రీకృష్ణ దేవాలయంలో గురువారం సప్తాహ్నిక పంచకుండాత్మక పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ద్వారతోరణ పూజ, అగ్నిముఖం, నిత్యబలి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నివేదన కార్యక్రమాలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల సద్గుణాచార్యులు, అంజి, భక్తులు పాల్గొన్నారు.

బోడుప్పల్ వార్షిక బడ్జెట్ రూ.75.21 కోట్లు

- ఆమోదించిన పాలకవర్గం
- పలు అభివృద్ధి పనులకు తీర్మానం


బడ్జెట్ సమావేశంలో మేయర్, కమిషనర్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరం వార్షిక బడ్జెట్ రూ.75.21 కోట్లకు తీర్మానించింది. నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన అంచనా బడ్జెట్ సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్‌లో ఇంటి పన్నుల ద్వారా రూ.16 కోట్లు, పన్నుయేతర రాబడి రూ.41.70 కోట్లు, ఇతర గ్రాంట్లు కలుపుకుని మొత్తం రూ.75.21 కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. అలాగే అభివృద్ధి పనులు, జీతభత్యాలు, ఇతర ఖర్చులకు గాను రూ.72.38 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇంకా రూ.2.83 కోట్లు మిగులు బడ్జెట్ ఉంటుందని తెలిపారు.

పాలకవర్గ సాధారణ సమావేశంలో..

బడ్జెట్ సమావేశం అనంతరం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై పాలకవర్గం చర్చించింది. అన్ని డివిజన్లలో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి పనుల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేసేందుకు తీర్మానించింది. అందుకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్లు కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, మేనేజర్ నాగేంద్రబాబు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోబోటిక్ సైన్స్ ఎగ్జిబిషన్ అదరహో..



ఉప్పల్: వారంతా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.. వారిలోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. చిట్టి చేతులతో రోబోలను తయారు చేసి నివ్వెరపోయేలా చేశారు. సోహం అకాడమి ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ శిల్పారామంలోని కల్యాణ వేదికలో రెండు రోజుల నుంచి నిర్వహించిన రోబోటిక్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రదర్శనలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి శెభాష్ అనిపించుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి స్లాబ్ కాంక్రీట్ వితరణ



బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలోని రాజలింగం కాలనీ ఫేస్-2లో 600 గజాల స్థలంలో నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయం స్లాబ్‌కి ఆర్ఎంసి కాంక్రీట్‌ను బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ సొంత నిధులతో వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు వితరణ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు పట్నోళ్ల విక్రంరెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు జనిగె వెంకటేశ్, తోటకూర రవీందర్ యాదవ్, సురేష్, పురుషోత్తం, సంపత్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

మౌలాలి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధముల ఆనంద్‌గౌడ్ సూచించారు. మల్కాజ్‌గిరి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా ఆనంద్‌గౌడ్ హాజరై మాట్లాడారు. మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మంగేష్, మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్, ఓబీసీ మోర్చా నాయకులు వినయ్, ఆనంద్‌గౌడ్, శంకరాచారి, రాము, బండారి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

